# సాక్షి
## వికారాబాద్

బుధవారం । 12 । జూన్ । 2024




### బడికి వేళాయె

వేసవి సెలవులను ఎంజాయ్ చేసిన విద్యార్థులు బుధవారం నుంచి బడిబాట పట్టనున్నారు. ఇప్పటికే పుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్, యూనిఫాం, షూష్ కొనుగోలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరాయి. తరగతి గదులను శుభ్రం చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. – అనంతగిరి



మర్పల్లి ఎమ్మార్సీ నుంచి పాఠ్యపుస్తకాలు తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు

## న్యూస్‌రీల్

### శుద్ధి చేసిన విత్తనాలే విత్తుకోవాలి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



విత్తన ప్యాకెట్లు చూపుతున్న అధికారులు

**పూడూరు:** శుద్ధి చేసిన విత్తనాలనే విత్తుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ రైతులకు సూచించారు. మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సు ద్వారా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువల గురించి వివరించారు. అనంతరం పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో రైతు శ్రీనివాస్‌రెడ్డి కంది పొలాన్ని సందర్శించారు. కంది విత్తనాలకు ఎండు తెగులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. విత్తనాలను శుద్ధి చేసే విధానాన్ని రైతులకు ప్రదర్శన ఇచ్చారు. జీవ ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ పరిగి డివిజన్ అధికారి లక్ష్మి కుమారి, మండల వ్యవసాయ అధికారి తులసీ రాం, రైతులు పాల్గొన్నారు.


### లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక



లక్కీ డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేస్తున్న లింగ్యానాయక్

**అనంతగిరి:** బెస్ట్ అవైలేబుల్ పాఠశాలలో ఖాళీల భర్తీకి లక్కీ డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బెస్ట్ అవైలేబుల్ పాఠశాలల్లో ఒకటవ తరగతి నాన్ రెసిడెన్షియల్, 5వ తరగతిలో రెసిడెన్షియల్ ప్రవేశాల కోసం అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 88 నాన్ రెసిడెన్షియల్ ఖాళీలకు గాను 135 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేశారు. అదే విధంగా 91(ఐదో తరగతి) రెసిడెన్షియల్ సీట్లకు గాను దరఖాస్తు చేసుకున్న 23 మంది విద్యార్థులను నేరుగా ఎంపిక చేసినట్లు అడిషనల్ కలెక్టర్ తెలిపారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



రాంబాబు

**అనంతగిరి:** బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సు ఉచిత శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. జూన్ 13వ తేదీలోగా రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లో గల స్వర్ణ భారతి ట్రస్ట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. స్వర్ణ భారతి ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సు వ్యవధి 30 రోజులని, ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం,వసతి సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేయవచ్చన్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల వాస్తవ్యులు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, మూడు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు చదవడం ,రాయడం తప్పనిసరిగా వచ్చి ఉండాలన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ల 93914 87797, 9177141712, 9618534720, 6301 890681లో సంప్రదించాలని సూచించారు.

### నేడు భవన ప్రారంభోత్సవం

**మోమిన్‌పేట:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వన్‌కుమార్ తెలిపారు. రూ.1.56 కోట్లతో నిర్మించిన భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. బుధవారం ఉదయం 11గంటలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుజల, చంద్రశేఖర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎదురుచూపులు



## పంట రుణాలు, రైతు భరోసా కోసం అన్నదాతల నిరీక్షణ

- వానాకాలం సీజన్ ప్రారంభమైనా రుణాల ఊసెత్తని బ్యాంకర్లు
- రైతులకు అందాల్సిన సాగు సాయం రూ.320 కోట్లు
- జిల్లాలో అన్నదాతల సంఖ్య 2.5లక్షలు
- సాగు విస్తీర్ణం 5.90లక్షల ఎకరాలు

**వికారాబాద్:** వానాకాలం సీజన్ ప్రారంభమైనా రైతులకు పంట రుణాలు.. రైతు భరోసా అందడం లేదు. ఈ ఏడాది పంట రుణాల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. బ్యాంకర్లు రుణాల ఊసే ఎత్తడం లేదు. రైతు భరోసా కూడా అందడంలేదు. దీంతో పంట పెట్టుబడుల కోసం అన్నదాతలు మళ్లీ వడ్డీ వ్యాపారుల గడప తొక్కక తప్పడం లేదు. బ్యాంకర్లు పంట రుణాలిస్తారా..? ఇవ్వరా అనే దానిపై స్పష్టత కూడా లేదు. పంట రకాలను బట్టి ఒక్కో పంటకు ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. దీంతో రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. సీజన్ ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా బ్యాంకర్లు రుణ ప్రణాళిక విడుదల చేయకపోవడం గమనార్హం.

### రుణప్రణాళిక ప్రకటించని బ్యాంకర్లు

సాధారణంగా ప్రతి ఏటా వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే బ్యాంకర్లు జిల్లాలో ఎంత మంది రైతులు ఉన్నారు..? ఎన్ని ఎకరాల సాగు భూమి ఉంది..? ఇవ్వాల్సిన రుణాలు ఎన్ని అనే దానిపై రుణ ప్రణాళికను సిద్ధం చేస్తారు. గతేడాది రూ.3,829 కోట్ల రుణాలు లక్ష్యంగా పెట్టుకోగా ఇందులో 60 శాతానికి మించి ఇవ్వలేదు. ఈ ఏడాది ఇంత వరకు రుణ ప్రణాళికే ప్రకటించలేదు. జిల్లాలో 2.50 లక్షల మంది రైతులు ఉండగా వారికి ఎంత మేర రుణం ఇవ్వాలనే దానిపై ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉంది. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడం ప్రారంభించి 15రోజులు కావస్తున్నా బ్యాంకర్లు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

### వానాకాలం సాగు 5.90లక్షల ఎకరాలు

ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో 5.90లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పంట రకాలను బట్టి ఒక్కో ఎకరానికి రూ. 30 వేల నుంచి రూ. లక్ష వరకు పెట్టుబడి అవసరం అవుతుంది. ఈ లెక్కన ప్రతి ఏటా జిల్లాలోని ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఆంధ్రా బ్యాంకు తోపాటు డీసీసీబీ తదితర బ్యాంకులు కలిసి ప్రతి ఏటా సగటున రూ.3,500 కోట్ల వ్యవసాయ రుణాలు ఇస్తాయి. ఈ ఏడాది జిల్లాలో ఉన్న 2.5 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రూ.320 కోట్ల సాగు సాయం అందించాల్సి ఉంది. నేటికీ అది అందలేదు. దీంతో రైతులకు పంట పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### పంట రుణాలివ్వాలి



ప్రతి ఏటా వానాకాలం పంటల సాగుకు బ్యాంకులు లోన్లు ఇచ్చేవి. ఈ సారి ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. బ్యాంకులకు వెళ్లినా ఫలితం కనిపించడం లేదు. ప్రభుత్వం ప్రతి పంటకు ఇచ్చే రూ.5వేల సాగు సాయం కూడా అందలేదు. అది వచ్చినా కొంత మేర ఇబ్బందులు తప్పుతాయి. ప్రభుత్వం స్పందించి వెంటనే బ్యాంకర్లు లోన్లు ఇచ్చేలా చూడాలి.

– కాశయ్య, రైతు, మల్లెపల్లి

# పశువుల అక్రమ రవాణాపై నిఘా

- జిల్లా వ్యాప్తంగా పది చెక్‌పోస్టులు
- ఎస్పీ కోటిరెడ్డి

**అనంతగిరి:** బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణా నిఘా ఉంచినట్లు ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో.. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా జరుపుకోవాలని సూచించారు. జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా 10 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా గోవులు, లేగదూడలను అక్రమ రవాణా చేయరాదని సూచించారు. వికారాబాద్, ధారూరు, మోమిన్‌పేట్, చెంగోముల్, పరిగి, తాండూరు, యాలాల పరిధిలో 7 అంతర జిల్లా చెక్‌పోస్టులు, బషీరాబాద్, కరణ్‌కోట్, కొడంగల్ ప్రాంతాల్లో 3 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల వ్యాపారులు గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ అధికారుల నుంచి ధ్రువపత్రాలు పొందిన తరువాతే పశువులను రవాణా చేయాలని ఆదేశించారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణా సమాచారం తెలిస్తే పోలీస్ అధికారులకు గానీ డయల్ 100కి గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

### చెక్‌పోస్ట్ పరిశీలన

వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ నాగరాజు తదితరులు ఉన్నారు.

### పరిమితికి మించితే వాహనం సీజ్

**ధారూరు:** మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డులో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. రిజిస్టర్‌ను పరిశీలించిన అనంతరం పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పశువులను అక్రమంగా రవాణా చేసినట్లు తెలిస్తే వెంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నగరానికి రవాణా చేస్తున్న పశువులకు ఫిట్ ఫర్ ట్రాన్స్‌పోర్టు సర్టిఫికెట్ తనిఖీ చేయాలని ఆదేశించారు. పరిమితికి మించి రవాణా చేసే వాహనాలను సీజ్ చేయాలన్నారు. పశువుల అక్రమ రవాణా అడ్డుకునేందుకు ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజు, ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.



ధారూరు: చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# బాధ్యతగా పనిచేయండి

- గురుకులాల ప్రత్యేక అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచన

**అనంతగిరి:** ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా, అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కేజీబీవీ, వసతి గృహాలు, గురుకులాల ప్రిన్సిపాళ్లు, ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులుగా విధి నిర్వహణలో ఎన్నో మంచి పనులు చేసే అవకాశం ఉంటుందన్నారు. మనసుకు సంతృప్తినిచ్చే విధంగా పని చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, అయినా ఉత్తీర్ణత శాతం అనుకున్న స్థాయిలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. మనం తీసుకుంటున్న జీతానికి న్యాయం చేస్తున్నామా? పని చేయకపోవడం వల్ల పిల్లల భవిష్యత్ ఏంటి అనే కోణంలో ఆలోచించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని సూచించారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా పోటీ పడాలన్నారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు విద్యార్థులు వచ్చేలోపు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఇందుకోసం గ్రామపంచాయతీ,మున్సిపాలిటీ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు.

### తల్లిదండ్రుల పాత్ర పోషించాల్సింది మనమే

దారిద్రరేఖకు దిగువనున్న గ్రామీణ, మధ్య తరగతికి చెందిన కుటుంబాల పిల్లలు వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తారని, మనం తల్లిదండ్రుల పాత్ర పోషిస్తూ వారి బాగోగులు చూసుకోవాలని కలెక్టర్ అన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు కనీస వసతులు అందుబాటులో ఉండాలన్నారు. మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, తలుపులు, కిటికీలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏమైనా మరమ్మతులు ఉంటే నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని.. వెంటనే అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సబ్జెక్టుల వారీగా ట్యూటర్లను నియమించుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలన్నారు. సమావేశంలో షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ రీజినల్ కోఆర్డినేటర్ శారద వెంకటేష్ పాల్గొన్నారు.

# ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీనివాస్

- టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

**షాద్‌నగర్‌రూరల్:** ప్రతిఒక్కరూ ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ప్రతం ఎడ్యుకేషనల్ కళాశాలలో మంగళవారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చే శక్తి విద్యార్థుల్లో ఉంటుందని అన్నారు. యువతీ యువకులు సామాజిక స్పృహను అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. విద్యార్థులు మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. చెట్లు లేకుంటే వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. కాలుష్యాన్ని తరిమి కొట్టాలంటే ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తమ ఇంటి ఆవరణతో పాటు వ్యవసాయ పొలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ నాయకులు సుదర్శన్, రాహుల్, శ్రీనివాస్, అఖిలేష్, వినయ్, వంశీ, విజయ్, రమేష్, సతీష్, నితీష్, సుజిత్, హర్షవర్ధన్, రిషికేష్, సాయి, నరేష్, అజయ్‌కుమార్, నాగరాజ్, రవితేజ, నర్సింహ, మహేందర్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాన్ వేశారు.. ప్రాణం తీశారు

- వీడిన హత్య కేసు మిస్టరీ
- ఐదుగురు నిందితులకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి ఏసీపీ కృష్ణయ్య



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి ఏసీపీ కృష్ణయ్య, చిత్రంలో నిందితులు

**మీర్‌పేట:** పాత నేరస్తుడి హత్యకు సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి ఏసీపీ కృష్ణయ్య వివరాలు వెల్లడించారు. నందనవనానికి చెందిన ప్రధాన నిందితుడు దాసరి సురేందర్ అలియాస్ సూరి (29) వృత్తిరీత్యా కారు డ్రైవర్. మృతుడు సల్మాన్‌తో కొంత కాలంగా పరిచయం ఉండడంతో పాటు ఇద్దరూ కలిసి గతంలో పలు నేరాలకు పాల్పడడంతో పీడీయాక్ట్ నమోదై జైలుకు సైతం వెళ్లి వచ్చారు. సురేందర్ 2021లో సల్మాన్ సోదరి సభా ఫాతిమాను కిడ్నాప్ చేసి బలవంతంగా వివాహం చేసుకోవడంతో పోలీసులు అతనిపై పోక్సో, రేప్ కేసు నమోదు చేసి 80 రోజుల రిమాండ్ విధించారు. జైలు నుంచి బయటకు వచ్చిన సురేందర్ మతం మార్చుకుని మొయిన్ మునీర్‌గా పేరు మార్చుకుని సల్మాన్ సోదరిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె జన్మించింది. 2022లో సురేందర్ భార్య ఫాతిమాను హత్య చేయడంతో ఎల్‌బీనగర్ పోలీసులు అతనిపై పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సల్మాన్ సోదరి (కజిన్) మంచాల స్వర్ణలతతో చనువుగా ఉంటున్నాడు. తన సోదరిని వివాహం చేసుకుని హత్య చేయడంతో పాటు మరో సోదరితో చనువుగా ఉండడాన్ని గమనించిన సల్మాన్ సురేందర్‌పై కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా హతమారుస్తానని స్నేహితులతో చెప్పగా విషయం సురేందర్‌కు తెలియడంతో అతనే ముందుగా సల్మాన్‌ను హత్య చేసేందుకు పథకం వేశాడు. దీనికి స్వర్ణలత, పాత నేరస్తులైన స్నేహితులు బొర్రా అరుణ్‌కుమార్, దుగాని లక్ష్మణ్, కేతావత్ అరుణ్ సహకరిస్తామని చెప్పారు. ఈ నెల 8న నందిహిల్స్‌లోని స్నేహితుడి ఇంట్లో ప్లాన్ వేశారు. పథకం ప్రకారం ఆర్థిక లావాదేవీల సమస్యను పరిష్కరించుకుందామని స్వర్ణలతను ఎరగా వేసి రాత్రి 11.30 గంటలకు సల్మాన్‌కు ఫోన్ చేసి టీకేఆర్ కమాన్ సమీపంలోని అయ్యప్ప దేవాలయం వద్ద నిర్జన ప్రదేశంలోకి పిలిపించారు. సల్మాన్ రాగానే సురేందర్‌తో పాటు మరో ముగ్గురు కత్తులతో పొడిచి హత్య చేశారు. ప్రధాన నిందితుడు సురేందర్‌తో పాటు స్వర్ణలత, మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సురేందర్‌పై పలు పోలీస్‌స్టేషన్లలో 39 కేసులు నమోదయ్యాయి. నిందితుల నుంచి రెండు కత్తులు, మూడు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, డీఐ గౌరీనాయుడు, ఎస్ఐలు గోవిందస్వామి, సుధాకర్, సిబ్బంది ఎల్లయ్య, నగేష్, శివరాజు, అనిల్‌రాజు పాల్గొన్నారు.

### మైసిగండి హుండీ ఆదాయం రూ.15.17 లక్షలు

**కడ్తాల్:** మైసిగండి మైసమ్మ దేవత, శివాలయ, రామాలయ దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శేఖర్ సమక్షంలో అధికారులు మంగళవారం లెక్కించారు. మొత్తం 75 రోజులకు గాను భక్తులు కానుకల రూపేణ వివిధ హుండీల్లో వేసిన మొత్తం లెక్కించగా రూ.15,17,494 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరా బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

### లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**మొయినాబాద్‌రూరల్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కామర్స్, జువాలజీ బోధించేందుకు పార్ట్‌టైమ్ ప్రాతిపదికన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌శర్మ తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత అన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు జిరాక్స్ కాపీలను జతచేసి ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలో గల ఎస్‌వీ విద్యా సంస్థల క్యాంపస్‌లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సమర్పించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి

# ఐదేళ్లు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

- జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి

**తుర్కయంజాల్:** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు, సంబంధిత సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటంతో పాటు, మౌలిక వసతుల కల్పనకు వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆమె అధ్యక్షతన మంగళవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పాలక వర్గం చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో ప్రజలకు ఉపయోగపడే ఎన్నో తీర్మానాలు చేశామని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన సాగేందుకు సహకరించిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్య, విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని పలువురు సభ్యులు కోరగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ అది శాఖాపరమైన నిర్ణయమని తెలిపారు. ప్రతి ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నిర్వహణ సరిగ్గా లేదని, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించి గ్రామాల్లో వాల్స్, కంట్రోల్ వాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణా రెడ్డి, డిప్యూటి సీఈఓ రంగారావు, పలువురు జెడ్పీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డీఎంహెచ్‌ఓ నుంచి వైద్యవిధాన పరిషత్‌లోకి..

కొడంగల్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ



కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్ ఆస్పత్రి డీఎమ్‌హెచ్‌ఓ పరిధి నుంచి వైద్య విధాన పరిషత్‌లోకి మారిందన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని అన్నారు. ప్రతీ గురువారం జనరల్ సర్జరీలు చేయనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని కోరారు. నిరంతరం ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. రోగులకు ఇబ్బంది లేకుండా సిబ్బందిని సేవలు అందించాలని ఆదేశించామన్నారు. ఆరోగ్య సమస్యలున్నవారు ప్రభుత్వాసుపత్రికి రావాలన్నారు. కొడంగల్‌లో గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉందన్నారు. గైనకాలజిస్టు వస్తే మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో డాక్టర్ సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

### బాలికతో అసభ్య ప్రవర్తన

వ్యక్తి రిమాండ్



నిందితుడు సాయిలు

యాలాల: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని యాలాల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గడసు సాయిలు అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో అరుపులు విన్న కుటుంబ సభ్యులు వెంటనే సాయిలును పట్టుకున్నారు. అనంతరం యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయిలును అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడని ఎస్‌ఐ చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### షోరూంలో చోరీ

శంకర్‌పల్లి: పట్టణంలోని ఓ ఎలక్ట్రానిక్స్ షోరూంలో చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. శంకర్‌పల్లి సీఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. నవాబుపేట్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ కొన్నేళ్లుగా శంకర్‌పల్లిలో ఎలక్ట్రానిక్స్ షోరూం నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి యథావిధిగా షోరూం మూసి వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం వేకువజామున 3.30గంటలకు ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు షోరూం షట్టర్‌ను ఇనుప రాడ్లులతో పగులగొట్టి లోపలికి వెళ్లారు. షోరూం యాజమాని శ్రీనివాస్ అద్దె చెల్లించడం కోసమని దాచిన రూ.1.10లక్షలను దుండగులు ఎత్తుకెళ్లారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకొని వేలిముద్రలు, సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

### 60 కిలోల గంజాయి పట్టివేత

తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు, సీజ్ చేసిన గంజాయి

అనంతగిరి: గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం జీఆర్‌పీ రైల్వే సీఐ వెంకటరత్నం తెలిపిన ప్రకారం.. సోమవారం సాయంత్రం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు వారిని పట్టుకుని తనిఖీ చేయగా వారి వద్ద రూ.15లక్షల విలువైన 60 కిలోల గంజాయి పట్టుబడింది. వీరిలో ఒకరు పరారవ్వగా ఒరిస్సాకు చెందిన సందీప్‌ను అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, జీఆర్‌పీ ఎస్‌ఐ శంకరయ్య, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బంగారం ఇచ్చేందుకు కసరత్తు



తాండూరు: కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



బొంరాస్‌పేట: చెక్కులు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు/పెద్దేముల్: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకంతో పేదింటి ఆడపిల్లల పెళ్లికి ప్రభుత్వం భరోసా ఇస్తోందన్నారు. నగదుతో పాటుగా తులం బంగారం ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దేముల్, తాండూరు, మండలాలతో పాటుగా మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. రూ.2.37కోట్ల విలువైన చెక్కులను 237 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెక్కులను వెంటనే బ్యాంకుల్లో వేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉన్నందువల్ల చెక్కుల పంపిణీ ప్రక్రియ నిలిచిందని వివరించారు. ఎన్నికలు ముగిసాయని.. ఇకపై నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. పేదలకు అందిస్తామని ప్రకటించిన 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్ అమలులోకి వచ్చిందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు అర్హులైన లబ్దిదారులకు బిల్లులు వేస్తే చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండస్వప్నపరిమళ్, పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, పెద్దేముల్ వైస్ ఎంపీపీ మధులత, కౌన్సిలర్లు విజయాదేవి, నీరజారెడ్డి, రత్నమాల, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, బోయరవిరాజ్, నాయకులు మల్కాడ్ రాకేశ్, గోపాల్, నర్సింహులు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పెళ్లిళ్లతో పేదలు కావద్దు**

బొంరాస్‌పేట: ఆడబిడ్డల పెళ్లిళ్లతో కుటుంబం పేదలు కావొద్దని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో ప్రభుత్వం పేదలను ఆదుకుంటోందని అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. మండల పరిధిలోని 25 కుటుంబాలకు, దుద్యాల మండలంలో షాదీముబారక్ రెండు, కల్యాణలక్ష్మి 34 మందికి పంపిణీ చేశారు. కడా అధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ హేమిబాయి, డిప్యూటీ తహసీల్దారు రవి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీంద్రచారీ, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తదితరులున్నారు.

## మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



నూతన అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న శాలిని

- మత్స్యకారుల ఎన్నికల అధికారి శాలిని
- గుండాల కమిటీ అధ్యక్షుడిగా పెద్ద వెంకటయ్య ఏకగ్రీవం

దోమ: మత్స్యకారులు తమ వృత్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని సంఘం ఎన్నికల అధికారి జి.శాలిని అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుండాలలో సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయిని పెద్ద వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా దస్తయ్య, కార్యదర్శిగా మహేశ్, సభ్యులుగా నర్సింలు, దస్తయ్య, వెంకటయ్య, అశోక్ నియమితులయ్యారు. అనంతరం నూతనకమిటీకి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాలిని మాట్లాడుతూ.. ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

### సత్తయ్య నియామకంపై హర్షం



మాట్లాడుతున్న మొగులయ్య

కుల్కచర్ల: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్యను క్యాబ్ వైస్ చైర్మన్‌గా నియమించడం హర్షణీయమని కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. టీజీ క్యాబ్ పాలకవర్గంలో జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించడం సంతోషంగా ఉందని, ఇందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రైతాంగ అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య గౌడ్, మాజీ సర్పంచ్ రవీందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫాంలు సకాలంలో అందించాలి

డీఆర్డీఓ శ్రీనివాస్



యూనిఫాం కుడుతున్న మహిళలతో మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీనివాస్

కుల్కచర్ల: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు అందించేందుకు మహిళ సంఘాల సమాఖ్య కృషి చేయాలని వికారాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో విద్యార్థులకు యూనిఫాం కుడుతున్న మహిళా సంఘాల సభ్యుల వద్దకు వెళ్లి మాట్లాడారు. విద్యార్థులకు సకాలంలో యూనిఫాం అందించేందుకు కృషి చేయాలని.. సమస్యలుంటే స్థానిక మహిళా సమాఖ్య అధికారులకు సూచించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల అభ్యున్నతికి వాటి నిర్వాహణ మరియు అభివృద్ధి బాధ్యతను మహిళ సంఘాలకు ఇచ్చామన్నారు. మహిళ సంఘాల నేతలు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శోభ, స్థానిక మహిళా సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న బంగారు ఆభరణాల అప్పగింత



బాధితుడికి బంగారు ఆభరణాలను అందజేస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: అజాగ్రత్తగా కారు దిగుతుండగా పడిపోయిన మూడు తులాల బంగారు ఆభరణాలను బాధితుడికి అందజేసిన ఘటన ఇబ్రహీంపట్నంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బీఎస్‌రెడ్డిలో నివాసముండే సీహెచ్ ఉష, మధుసూదన్‌రెడ్డిలు తమ వద్దనున్న మూడు తులాల బంగారు గొలుసు, చెవికమ్మలు బాగు చేయించుకునేందుకు ఇబ్రహీంపట్నానికి గతంలో వచ్చారు. కారు దిగే సమయంలో బంగారు ఆభరణాలు ఎక్కడో పడిపోయాయి. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీసీ ఫుటేజీలను కానిస్టేబుళ్లు శ్రీను, రాజులు ప్రత్యేకంగా పరిశీలించారు. బంగారు ఆభరణాలు కట్టిన కాగితపు పేపర్‌ను ఒక వ్యక్తి తీసుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే అతడిని ప్రశ్నించగా.. దొరికిన బంగారాన్ని పోలీసులకు ఇచ్చేశాడు. దీంతో బాధిత కుటుంబానికి బంగారు ఆభరణాలను అందజేసినట్లు సీఐ తెలిపారు.

## ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి



డీఈఓ రేణుకాదేవికి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు

అనంతగిరి: అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ రేణుకాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజులు కట్టలేక విద్యార్థుల తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలు, యూనిఫాంలు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనలు పాటించకుండా ఫీజులను 30శాతం వరకు పెంచి సొమ్ము చేసుకుంటున్నాయన్నారు. అనుమతి లేకుండా కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మహేశ్, జాయింట్ సెక్రటరీ జగదీశ్, రాజేందర్, మురళి తదితరులున్నారు.

## బకాయి వేతనాలు చెల్లించండి



పెద్దేముల్ ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించిన పంచాయతీ కార్మికులు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

పెద్దేముల్: గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఎంపీడీఓ జర్నప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను, సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. మల్టీ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. విధి నిర్వాహణలో ప్రమాదం జరిగి మరణించిన కుటుంబాలకు పోస్టాఫీస్ బీమా పథకం ద్వారా ప్రభుత్వం రూ.10లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఎనిమిది గంటల పనిదినం, వారాంతపు సెలవు, పండగ సెలవులు, జాతీయ ఆర్థిక సెలవులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండల అధ్యక్షుడు, వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## చెట్లు నరికిన చోట మొక్కలు నాటండి

డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: దోర్నాల్ అడవిలో శని, ఆదివారాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికి పంట పొలాలుగా మార్చేందుకు యత్నించారు. ఇదే విషయం మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'అడవిలో చెట్ల నరికివేత' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు ఫారెస్ట్ ఇన్‌చార్జి రేంజర్ అరుణ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మొయినుద్దీన్, బీట్ ఆఫీసర్ ఆనంద్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకుని చెట్లను నరికిన వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. చెట్లు నరికిన ప్రాంతంలో మొక్కలు నాటించేందుకు గుంతలు తవ్వించాలని డీఎఫ్ఓ అధికారులను ఆదేశించారు. సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకుంటామన్నారు. దాదాపు నాలుగు ఎకరాల మేర అటవీ ప్రాంతంలో చెట్లను నరికినట్లు గుర్తించామన్నారు.

**అధికారులను అడ్డుకున్న గిరిజన మహిళలు**

దోర్నాల్ బీట్‌లో చెట్లు నరికివేసి పంట భూమిగా మార్చిన ప్రాంతంలో పనులు చేయిస్తున్న ధారూరు ఫారెస్టు ఇన్‌చార్జి రేంజర్ అరుణ, ఇతర అధికారులను దోర్నాల్‌తండా గిరిజన మహిళలు అడ్డుకున్నారు. తమ విధులకు ఆటంకం కల్గించిన మహిళలపై ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌ఓ అరుణ ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్, సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి గొడవకు దిగిన వారిని అక్కడి నుంచి పంపించారు. ఈ సందర్భంగా ఆమె గిరిజనులతో మాట్లాడుతూ పోడు పట్టాలు ఇచ్చిన ప్రాంతం కాకుండా అటవీ భూమిని ఆక్రమిస్తే చర్యలుతప్పవని హెచ్చరించారు.



ధారూరు ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌ఓ అరుణను అడ్డుకున్న దోర్నాల్‌తండా మహిళలు

## సర్కారు బడుల్లో సౌకర్యాలు మెరుగు

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్



పూర్యానాయక్‌తండాలో యూనిఫాం పంపిణీ చేస్తున్న రవీందర్‌గౌడ్

బొంరాస్‌పేట: విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వం సర్కార్ బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందని తెలంగాణ విద్యావంతుల వేదిక(టీవీవీ) రాష్ట్ర కార్యదర్శి కె.రవీందర్‌గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పూర్యానాయక్ తండా, బాపల్లి తండా, ఎన్కేపల్లి తదితర పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో మధ్యాహ్నం మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన తాగునీరు, మరుగుదొడ్లు, మరమ్మతులు ముమ్మరంగా సాగుతున్నాయని మొదటిరోజు నుంచే విద్యార్థులు పండగ వాతావరణంలో బడులకు చేరుకుంటారని ఆయన అన్నారు. మహిళలకు ప్రాధాన్యతనిచ్చి ఐకేపీ ద్వారా యూనిఫాంలు తయారీ చేసి ఇవ్వడం హర్షనీయమన్నారు. బడిబాటలో భాగంగా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి ఉచిత విద్యను పొందాలని ఉపాధ్యాయులన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్ పాఠశాల కమిటీ చైర్మన్‌లు బేబీబాయి, గ్రామ సంఘం మంగ్లీబాయి, మాజీ సర్పంచ్ మేగ్యానాయక్ తదితరులున్నారు.

## వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు

ఏడుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

మొయినాబాద్: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన మంగళి శ్రీకాంత్‌తో పాటు శ్రీనివాస్, అతని ముగ్గురు కూతుళ్లు ఉదయం కారులో మొయినాబాద్‌కు వచ్చారు. మధ్యాహ్నం తిరిగి అప్పారెడ్డిగూడ బయలుదేరారు. మొయినాబాద్ సమీపంలోని కిరన్ వేబ్రిడ్జ్ వద్దకు వెళ్లగానే డ్రైవర్ శ్రీకాంత్ కారును అతివేగంగా నడిపి ఎదురుగా వస్తున్న చేవెళ్ల మండలం కందవాడకు చెందిన శ్రావణ్ కారును కుడివైపున ఢీకొట్టాడు. దీంతో కారులో ఉన్న శ్రీకాంత్, శ్రీనివాస్‌తోపాటు ముగ్గురు పిల్లలకు గాయాలయ్యాయి. శ్రావణ్ కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అతనికి ఎలాంటి గాయాలు కాలేదు. శ్రీనివాస్‌కు, అతని కూతుళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స కోసం స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

**బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా ఘటన**

ద్విచక్రవాహనాన్ని ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన మేకల కొమురయ్య, జంగమ్మ దంపతులు ఉదయం జనవాడలో మృతి చెందిన తమ బంధువు అంత్యక్రియలకు వెళ్లేందుకు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలోకి వెళ్లగానే వెనకనుంచి అతివేగంతో వచ్చిన గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. దంపతులిద్దరూ రోడ్డుపై పడటంతో గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్సకోసం స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

### వైద్య వాహనాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కందుకూరు: మండల కేంద్రంలో మంగళవారం సంచార పశువైద్యశాల, 102 అమ్మ ఒడి వాహనాలను జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా కోఆర్డినేటర్ రాజాబాబు తనిఖీ చేశారు. పశువైద్య వాహనంలో సిబ్బంది పశువుల వద్దకు వెళ్లి చికిత్స చేసే విధానాన్ని పరిశీలించారు. మందులు ఉన్నాయా లేదా అని వాకబు చేశారు. సేవలతో రైతుల ప్రశంసలు పొందాలని సూచించారు. అనంతరం 102 వాహనాన్ని తనిఖీ చేశారు. గర్భిణులకు 102 వాహనం అందుబాటులో ఉండి సేవలందించాలని సూచనలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో రేణుక ఎల్లమ్మ తల్లి



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

## కొనసాగుతున్న కోత్లాపూర్ జాతర

- రేణుక ఎల్లమ్మ తల్లి దర్శనానికి బారులు
- పొరుగు రాష్ట్రాల నుంచి పోటెత్తిన భక్తజనం

తాండూరు రూరల్: భక్తుల కొంగు బంగారంగా పేరుగాంచిన కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర వైభవంగా సాగుతోంది. ఈ జాతర ఉత్సవాలు నెల రోజుల పాటు కొనసాగనున్నాయి. అమ్మవారికి అత్యంత ప్రీతియైన మంగళవారం స్థానికులతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డప్పు వాయిద్యాల నడుమ బోనమెత్తుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 22 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ ఈఓ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.